సాక్షి విజయనగరం

బుధవారం । 24 । జూలై । 2024

న్యూస్‌రీల్

ముంపులో పంట పొలాలు



ఉప్పర్నాయుడువలస వద్ద నీటమునిగిన పంట పొలాలు

రేగిడి: మండలంలోని ఉప్పర్నాయుడువలస, అక్కన్నఅగ్రహారం, వన్నలి తదితర గ్రామాల్లో వరి పంట పొలాలు వరద ముంపునకు గురయ్యాయి. ఇటీవల కురిసిన వర్షాలకు నీరు పొలాల్లో చేరింది. బండిగెడ్డ ఉద్ధృతంగా ప్రవహించడంతో 500 ఎకరాల మేర వరి ఉబాలు, వెద పొలాలు నీటమునగడతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయాధికారులు స్పందించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

గిరిజన వర్సిటీలో ప్రాంగణ ఎంపికలు

- తొలిబ్యాచ్ టూరిజం గ్రాడ్యుయేట్లకు శతశాతం ప్లేస్‌మెంట్స్



ప్రాంగణ ఎంపిక ఉత్తర్వులను అందజేస్తున్న వీసీ ప్రొఫెసర్ కట్టిమణి

విజయనగరం అర్బన్: కేంద్రీయ గిరిజన యూనివర్సిటీలోని టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ విభాగం 2019–2024కి చెందిన ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ తొలిబ్యాచ్ గ్రాడ్యుయేట్లు టూరిజం మరియు హాస్పిటాలిటీ పరిశ్రమలో ఉద్యోగాలు సాధించారు. వర్సిటీలో జరిగిన ప్రాంగణ ఎంపికల్లో హైదరాబాద్‌లోని ప్రజ్వాయేజెస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో చిల్ల ఉదయ్ కుమార్, కె.వెంకట శ్రావణి, జీఏర్ హాలి హాలిడేస్ సంస్థలో బద్రీనారాయణ్, థామస్‌కుక్ లిమిటెడ్ సంస్థకు రెడ్డి భావని ఎంపికైనట్టు వీసీ ప్రొఫెసర్ కట్టిమణి మంగళవారం తెలిపారు. ఎంపికై న వారికి టూరిజం విభాగం డీన్ ప్రొఫెసర్ జితేంద్రమోహన్ మిశ్రాతో కలిసి వీసీ ఎంపిక ఉత్తర్వులను అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసన్, వివిధ విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

పొలం పనికి వెళ్లి.. విగతజీవిగా మారి..

- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు



పొలంలో హైమావతి మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్‌ఐలు

మెరకముడిదాం: మండలంలోని ఊటపల్లి గ్రామానికి చెందిన బొత్సా హైమావతి (27) మంగళవారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైమావతి ఉదయం పొలంపనికి వెళ్లింది. భర్త అచ్చెన్నాయుడు పొలంలో వరి ఆకు కట్టలు సర్దుతున్నాడు. ఏమైందో తెలియదు ఆమె ఒక్కసారిగా పొలంలో పడిపోయి మృతిచెందింది. మూర్ఛ వ్యాధి రావడంతో చనిపోయిందంటూ భర్త అచ్చెంనాయుడు హైమావతి తండ్రి ఆవాల అప్పలనాయుడుకు ఫోన్‌లో తెలిపారు. ఆయన ఘటనా స్థలానికి చేరుకుని హైమావతి మృతిపై అనుమానం ఉందంటూ బుధరాయవలస పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో చీపురుపల్లి సీఐ షణ్ముఖరావు, బుధరాయవలస ఎస్‌ఐ బి.లోకేశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకొని హైమావతి మృతదేహాన్ని పరిశీలించారు. పొలంలో పనిచేసేవారిని ఆరాతీశారు. పొలంపని చేస్తుండగా ఒక్కసారిగా ఆమె పడిపోయిందని, దగ్గరలో ఉన్న భర్త, ఆయన తండ్రి మంచినీరు తాగించారని, అయినా స్పందించలేదని తెలిపారు. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పదమృతిగా కేసు నమోదుచేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీపురుపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కొంచెం ఇష్టం కొంచెం కష్టం



- కేంద్ర బడ్జెట్‌పై మిశ్రమ స్పందన
- ఉమ్మడి విజయనగరం జిల్లాకు మొండిచేయి
- ప్రస్తావనకు రాని గిరిజన వర్సిటీ, భోగాపురం విమానాశ్రయం
- ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుకు కాస్త ఊపిరి

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

ఏపీలోని కూటమి ప్రభుత్వం ఎన్డీఏలో కీలక భాగస్వామి. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అధిక నిధుల రాబట్టుకునే అవకాశం ఉంది. ప్రత్యేక హోదా లేదంటే ప్రత్యేక ప్యాకేజీ అయినా సాధిస్తుందని అంతా ఆశించారు. కానీ నిధుల సాధనలో మన ప్రజాప్రతినిధులు విఫలమయ్యారు. ఉమ్మడి విజయనగరం జిల్లాకు బడ్జెట్‌లో ఎలాంటి అభయం లభించలేదు. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం గురించి నిర్మలమ్మ తన ప్రసంగంలో ప్రస్తావించినా ఉత్తరాంధ్రకు స్పష్టమైన అభయమేదీ నేరుగా ఇవ్వలేదు. ఇక్కడి కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయానికి పైసా నిధులు విదల్చలేదు. ఉత్తరాంధ్ర అభివృద్ధికే దిక్సూచిగా మారనున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణానికి బడ్జెట్‌లో ఎలాంటి ప్రత్యేక కేటాయింపులు లేకపోవడం జిల్లా ప్రజలకు నిరాశ మిగిల్చింది. పోలవరం ప్రాజెక్టు పూర్తిలో భాగంగా ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుకు కాస్త ఊపిరిపోశారు. 2024 సార్వత్రిక ఎన్నికల తర్వాత ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్‌లో ఊహించని మెరుపులు ఉంటాయని ఆశించినవారికి నిరాశే మిగిలిందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

విమానాశ్రయానికి రిక్త హస్తం



ఉత్తరాంధ్రకే తలమానికమైన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణ పనులు 31 శాతం పూర్తి అయ్యాయని కేంద్ర ప్రభుత్వం తాజాగా ప్రకటించింది. విమానాశ్రయ నిర్మాణానికి అవసరమైన 2,200 ఎకరాలను జీఎమ్మార్ సంస్థకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం స్వాధీనం చేసింది. ఇందుకోసం సేకరించిన 2,700 ఎకరాల్లో మిగిలిన 500 ఎకరాల్లో విమానాయాన అనుబంధ పరిశ్రమలకు, ఐటీ, సేవల రంగానికి కేటాయించాలని ఆలోచన చేసింది. ఇప్పుడు ఆ భూమిని తమకు ఇవ్వాలని జీఎమ్మార్ సంస్థ ఇటీవల పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబును కోరింది. ఆ భూములను విమానాయాన అనుబంధ పరిశ్రమలకు కేటాయిస్తామని ఆ ముందురోజే కేంద్ర పౌరవిమానాయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ప్రకటించారు. బీహార్‌లో కొత్త విమానాశ్రయాలు నిర్మిస్తామని కేంద్ర బడ్జెట్‌పై తన ప్రసంగంలో ప్రస్తావించిన నిర్మలమ్మ... భోగాపురం విమానాశ్రయం ఊసే తేలేదు.

- గిరిజన వర్సిటీపై సవతిప్రేమ



గిరిజనులకు గుర్తింపుగా, గిరిజన కుటుంబాల్లో విద్యా దీపం వెలిగించేలా ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం కింద కేంద్ర ప్రభుత్వం రెండు తెలుగు రాష్ట్రాలకు రెండు కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయాలను మంజూరు చేసింది. మన రాష్ట్రానికి వచ్చిన యూనివర్సిటీకి సంబంధించి ప్రస్తుతం విజయనగరంలోని ఏయూ పీజీ కాలేజీ భవనంలో తాత్కాలికంగా తరగతులు నిర్వహిస్తున్నారు. దీనికి శాశ్వత భవనాల నిర్మాణం కోసం మెంటాడ, దత్తిరాజేరు మండలాల్లో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇప్పటికే 561.88 ఎకరాలను సేకరించింది. అక్కడ మౌలిక సదుపాయాల కల్పనకు, రైతులకు నష్టపరిహారం చెల్లింపునకు రూ.430 కోట్లు మంజూరు చేసింది. ఇక భవన నిర్మాణాలను ప్రారంభించడానికి కేంద్ర ప్రభుత్వానిదే ఆలస్యం. గత ఏడాది ఆగస్టులో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో కలిసి కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ శంకుస్థాపన చేసిన సంగతి తెలిసిందే. కానీ కేంద్రం సవతిప్రేమ చూపిస్తోంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని రెండు యూనివర్సిటీలకు కలిపి 2022-23 బడ్జెట్‌లో రూ.43.75 కోట్లు, 2023-24 బడ్జెట్‌లో కేవలం రూ.35.67 కోట్లు కేటాయించింది. ఈసారి 2024-25 బడ్జెట్లో దాని ప్రస్తావనే లేదు.

- రైతులకు కాస్త బాసట...



ప్రకృతి వ్యవసాయంలో విజయనగరం జిల్లా, పార్వతీపురం మన్యం జిల్లా రైతులు ముందున్నారు. విజయనగరంలో జిల్లాలో సుమారు 50 వేల ఎకరాల్లో, పార్వతీపురం మన్యం జిల్లాలో 95.5 వేల ఎకరాల్లో రైతులు సేంద్రియ ఆధారిత వ్యవసాయం చేస్తున్నారు. వారికి మరింత ప్రోత్సాహకంగా ఆయా వ్యవసాయ ఉత్పత్తులకు ధ్రువీకరణ, బ్రాండ్ కల్పించేందుకు బాధ్యత తీసుకుంటామని కేంద్ర బడ్జెట్ ప్రసంగంలో మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. కూరగాయల ఉత్పత్తి పెంచడం, మార్కెటింగ్ విస్తృతం చేయడానికి వీలుగా కేంద్రం భరోసా కల్పించనుంది. రైతు ఉత్పత్తిదారుల సంఘాల (ఎఫ్‌పీవో)ను ప్రోత్సహించడం, సహకారాన్ని విస్తరించడం, కూరగాయల సేకరణ, సరఫరా, నిల్వ, మార్కెటింగ్‌లో స్టార్ట్ అప్‌లను తీసుకురావడం అనే లక్ష్యాలను నిర్దేశించుకోవడం ఆశాజనకమే.

- గిరిజనులకు ఈసారైనా...

గిరిజన ప్రాంతాల్లో ఎక్కువ మంది సికిల్‌సెల్ అనీమియాతో దీర్ఘకాలంగా బాధపడుతున్నారు. ఈ రోగాన్ని పూర్తిగా పారదోలే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం గత బడ్జెట్‌లో సికిల్ సెల్ అనీమియా ఎలిమినేషన మిషన్‌ను ప్రకటించింది. కానీ ఇప్పటివరకూ ఆ దిశగా అడుగులు పడలేదు. 'ప్రధానమంత్రి పీవీటీజీ డెవలప్‌మెంట్ మిషన్'ను ప్రకటించినా ఏ మార్పు కనిపించలేదు. ఈసారి మాత్రం దేశవ్యాప్తంగా 63వేల గ్రామాల్లో 5 కోట్ల గిరిజనుల సామాజిక, ఆర్థిక పరిస్థితులను మార్పు చేయడమే లక్ష్యంగా ప్రధానమంత్రి జనజాతీయ ఉన్నత్ గ్రామ్ అభియాన్ (పీఎంజేయూజీఏ) అని మరో కొత్త కార్యక్రమాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించారు. ఇదైనా సాకారమవ్వాలని గిరిజనులు ఆశిస్తున్నారు.

- పరిశ్రమలకు మంచి కాలం



చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్‌ఎంఈ)కు ఈసారి కేంద్ర బడ్జెట్‌లో అనేక ప్రోత్సాహకాలను కేంద్రం ప్రకటించింది. జిల్లాలో బొబ్బిలి గ్రోత్ సెంటర్‌తో పాటు కొత్తవలస, నెల్లిమర్ల, విజయనగరంలో పారిశ్రామికవాడలు ఉన్నాయి. ఇవిగాక శృంగవరపుకోట మండలంలో వెయ్యి ఎకరాల విస్తీర్ణంలో జిందాల్ ఎంఎస్‌ఎంఈ పార్కు, కొత్తవలస మండలంలో రెల్లి వద్ద మహిళా పారిశ్రామిక పార్కు ప్రతిపాదన దశలో ఉన్నాయి. వీటన్నింటికీ మంచి కాలమే. అంతేకాదు సుశిక్షితులైన మానవ వనరులు అందుబాటులోకి తేవడమే లక్ష్యంగా పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లను అప్‌గ్రేడ్ చేస్తామని కేంద్ర మంత్రి ప్రకటించడం సానుకూలాంశం. ముద్రా రుణాల పరిమితిని రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకూ పెంచడం శుభసూచకం.

- ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి ఊపిరి

పోలవరం ప్రాజెక్టును నిర్దిష్ట గడువేదీ లేకపోయినా పూర్తి చేస్తామని కేంద్ర బడ్జెట్‌లో ప్రస్తావించారు. తద్వారా ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుకు ఊపిరి పోశారు. పోలవరం మిగులు జలాల ఆధారంగా తలపెట్టిన ఈ ప్రాజెక్టు పూర్తి అయితే విజయనగరం జిల్లాలో నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది.

- అభివృద్ధికి ప్రత్యేక నిధులు...

వెనుకబడిన ప్రాంతమైన ఉత్తరాంధ్రకు ప్రత్యేక నిధులు (గ్రాంట్) ఇస్తామని కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించారు. గతంలో ఏటా రూ.50 కోట్ల చొప్పున ఈ నిధులు జిల్లాకు అందుబాటులోకి వచ్చేవి. వీటిని మరింత పెంచితే అభివృద్ధి పనులకు ఉపయోగపడతాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

రుణమా? సాయమా ?



కేంద్ర బడ్జెట్‌లో 15వేల కోట్లు అమరావతికి ఇస్తామన్నారు. ఇది రుణమా, సాయమా అన్నది స్పష్టత లేదు. వికసిత్ భారత్ అంటూ కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పేదలు, దళితులు, గిరిజనులకు ఏ వెలుగులు కనిపించడం లేదు. కేంద్రీయ గిరిజన యూనివర్సిటీకి నిధుల కేటాయింపు ప్రస్తావనే లేదు. పోలవరం, రైల్వే జోన్, స్టీల్ ప్లాంట్, ప్రత్యేక హోదా వంటి అంశాల ఊసేలేకపోవడం విచారకరం. గతంలో బీజేపీ ప్రభుత్వానికి రాష్ట్ర ఎంపీల అవసరం లేకపోయింది. నేడు మన ఎంపీలే కేంద్రానికి కీలకం. ఈ దశలో ప్రత్యేక హోదా, నిధులు సాధించకపోతే రాష్ట్రం వెనుకబడిపోతుంది. ప్రజా సంక్షేమానికి నిధులు కేటాయించకపోవడం అన్యాయం.

– పీడిక రాజన్నదొర, మాజీ డిప్యూటీ సీఎం

ప్రాధాన్యం సున్నా



ఎన్‌డీఏతో భాగస్వామిగా ఉన్నప్పటికీ బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు తగిన ప్రాధాన్యం ఇవ్వలేదు. రైల్వే జోన్, ప్రత్యేక హోదా గురించి ప్రస్తావించ లేదు. పోలవరానికి సహకరిస్తామని చెప్పారే తప్ప ఏడాదికి ఏ స్థాయిలో ఆర్థిక సహకారం అందిస్తారో ప్రకటించలేదు. రాజధాని నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష కోట్లు అడిగితే రూ.15 వేల కోట్లు అదికూడా రుణాల రూపంలో సమకూర్చుతామని ప్రకటించారు. విభజన చట్టంలోని హామీలను విస్మరించారు. మొత్తంగా కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ ఆంధ్రరాష్ట్రానికి మొండిచేయి చూపింది.

– కురిమినేని అప్పలనాయుడు, రిటైర్డ్ ప్రిన్సిపాల్, ఆర్థిక శాస్త్ర నిపుణుడు

చిన్నతరహా వ్యాపారానికి ఊరట



ఈ సారి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ చిన్నతరహా వ్యాపార రంగానికి ఊరట కలిగించేలా ఉంది. జీఎస్టీ వ్యవస్థలో మార్పులు తీసుకురావడానికి ప్రయత్నిస్తామని చెప్పడం శుభపరిణామం. అభివృద్ధికి అంతగా ప్రాధాన్యం ఇవ్వలేదు.

– కాపుగంటి ప్రకాశ్, అధ్యక్షుడు, చాంబర్ ఆఫ్ కామర్స్, విజయనగరం

మధ్య తరగతి ప్రజలకు నిరాశ



దేశంలోని వేతన, మధ్య తరగతి ప్రజలకు 2024–25 కేంద్ర బడ్జెట్ నిరాశపర్చింది. వారి సంక్షేమాభివృద్ధికి ఏ విధమైన ప్రాధాన్యం ఈ బడ్జెట్‌లో ఇవ్వలేదు. ఎన్‌డీఏ భాగస్వామ్య ప్రభుత్వం ఏపీలో కొనసాగుతున్నా నిధులు విదల్చకపోవడం విచారకరం. రాష్ట్రం విడిపోయి 11 సంవత్సరాలు దాటుతున్నా విభజన చట్టం ద్వారా రాష్ట్రానికి రావాల్సిన నిధులు ఇవ్వకపోవడం శోచనీయం. నిధులు రాబట్టడంలో విఫలమైనట్టే లెక్క.

– పిటపర్తి సాంబశివ శాస్త్రి, అధ్యక్షుడు, బ్రాహ్మణ జన సంఘ్, విజయనగరం

సాదాసీదా బడ్జెట్



వేతన జీవులకు ఈ బడ్జెట్ ఊరటనివ్వలేదు. స్టాండర్డ్ డిడెక్షన్ రూ.50 వేల నుంచి రూ.75 వేల వరకు పెంచినప్పటికీ ఆదాయపు పన్ను రేట్లు తగ్గించలేదు. దీనివల్ల వేతన జీవులకు కలిగే ప్రయోజనం శూన్యం. విభజన చట్టంలోని హామీలను నెరవేరుస్తామన్నారు. ఉద్యోగావకాశాలను పెంచుతామన్నారు. వాటికి సంబంధించిన ప్రస్తావన బడ్జెట్‌లో ఎక్కడా ప్రస్తావించలేదు. బడ్జెట్‌లో ప్రత్యేక ఆకర్షణ ఏమీ లేదు. సాదా సీదాగా ఉంది.

– కొరుపోలు సత్యారావు, విశ్రాంతి ఉపాధ్యాయుడు, విజయనగరం

ఏపీకి అన్యాయం



కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం జరిగింది. బడ్జెట్‌లో ప్రత్యేక హోదా ప్రస్తావనే లేకపోవడం విచారకరం. నిధులు కూడా పూర్తిస్థాయిలో కేటాయించలేదు. రాహుల్ గాంధీకి ఏపీ ఎంపీలందరూ సహకరిస్తే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏపీకి ప్రత్యేక హోదా తీసుకొస్తాం.

– సరగడం రమేష్‌కుమార్, డీసీసీ అధ్యక్షుడు

ప్రత్యేక హోదా ఏదీ?



రాష్ట్రంలో 21 మంది ఎంపీలున్న కూటమి ప్రభుత్వం ప్రత్యేక హోదా అడగకపోవడం విచారకరం. ఎన్‌డీఏ భాగస్వామిగా ఉన్న ఎంపీలు ప్రత్యేక హోదా డిమాండ్ చేయడానికి ఇదే మంచి అవకాశం. ఉద్యోగులకు పన్ను శ్లాబులను సవరించడం కొంత ఊరట కలిగించినా, విద్యా, వైద్య రంగాలకు బడ్జెట్‌లో ప్రాధాన్యత లేదు.

– డాక్టర్ కౌలు చిరంజీవులు, ఆర్థిక శాస్త్ర బోధకుడు, బొబ్బిలి

స్వాగతించేలా ఉంది..



కేంద్ర ప్రభుత్వం ఏపీ రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.15 వేల కోట్లు కేటాయించడం సంతోషదాయకం. పోలవరం ప్రాజెక్టు పనులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకునేలా కేంద్రం యోచించడం హర్షణీయం.

– రెడ్డి పావని, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి

మాటల్లో కాదు... చేతల్లో ఉండాలి



కేంద్ర ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయంపై బడ్జెట్‌లో కీలక అంశాలు వెల్లడించింది. ప్రకృతి వ్యవసాయంలోకి దేశవ్యాప్తంగా కోటిమంది రైతులను తీసుకొచ్చే ప్రణాళిక రూపొందిస్తున్నామని పేర్కొంది. ఐదు రాష్ట్రాల్లో కిసాన్ క్రెడిట్ కార్డులు ఇవ్వడం, వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.1.5 లక్షల కోట్లు కేటాయించామని చెప్పడం విడ్డూరంగా అనిపిస్తుంది. లెక్కలన్నీ చేతల్లో చూపిస్తే దేశం బాగుంటోంది. ఉత్తరాంధ్ర అభివృద్ధికి ప్రత్యేక ప్రస్తావనే లేదు.

– గేదెల వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి మాజీ అధ్యక్షుడు, ఉనుకూరు, రేగిడి మండలం

నిధులేవీ?



కూటమి ప్రభుత్వ సహకారంతో కేంద్రంలో ప్రభుత్వం ఏర్పడినప్పటికీ తొలి బడ్జెట్‌లో ఏపీకి నిధుల కేటాయింపు ఆశించిన స్థాయిలో లేకపోవడం విచారకరం. ప్రత్యేకహోదాలో భాగంగా ప్రకటించిన రూ.15 వేలు కోట్ల నిధులు రుణమా, లేక ప్రోత్సాహకమా అనేది బడ్జెట్‌లో స్పష్టం చేయలేదు. పోలవరంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని చెప్పారే తప్ప ఎలాంటి నిధులు కేటాయించలేదు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయబోమని స్పష్టత ఇవ్వలేదు. దీనిపై సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీసీఎం పవన్‌కళ్యాణ్‌లు నోరుమెదపకపోవడం దారుణం.

– వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి, చీపురుపల్లి

అరాచక పాలనపై హస్తినలో నేడు ధర్నా



వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, జోగులు, నాయుడుబాబు, పులిరాజు

- ఢిల్లీకి చేరుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు
- పార్టీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డితో భేటీ

సాక్షి ప్రతినిధి, విజయనగరం: కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో అరాచక, ఆటవిక పాలనను యావత్ దేశం దృష్టికి తీసుకెళ్లాలని వైఎస్సార్‌సీపీ బుధవారం దేశ రాజధాని ఢిల్లీ వేదికగా ధర్నా నిర్వహించనుంది. ఇందులో పాల్గొనేందుకు విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల నుంచి పలువురు నాయకులు పార్టీ డిప్యూటీ రీజనల్ కోఆర్డినేటర్, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర సమన్వయంతో మంగళవారం బయల్దేరి వెళ్లారు. రాత్రి ఢిల్లీకి చేరుకున్న వారంతా పార్టీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. వారిలో మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, రాజాం మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, చోడవరం మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, రాష్ట్ర కొప్పల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ కేవీవీ సూర్యనారాయణరాజు (పులిరాజు) తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా పీడిక రాజన్నదొర 'సాక్షి'తో ఫోన్‌లో మాట్లాడారు. 'నాలుగోసారి ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు పాలన ఎలా ఉంటుందో చూడాలని ఆరునెలల పాటు సమయం ఇవ్వాలని మా పార్టీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. అయితే, మా ప్రభుత్వం పకడ్బందీగా అమలుచేసిన పథకాలన్నీ ఇప్పుడీ చంద్రబాబు ప్రభుత్వం ఎగ్గొట్టేస్తోంది. ఎన్నికల హామీలకు ఎగనామం పెడుతోంది. దీని నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికి రాష్ట్రంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు అరాచక, ఆటవిక పాలనకు ఆజ్యం పోస్తున్నారు. హత్యలు, హత్యాయత్నాలు, దాడులు, విధ్వంసాలు సృష్టిస్తున్నారు. శాంతిభద్రతలకు తీవ్ర భంగం కలిగిస్తున్నారు. ముక్కుపచ్చలారని చిన్నారులపై కూడా మానభంగాలు జరుగుతున్నాయి. పట్టపగలే రోడ్డుపై హత్యలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజల కోసం, రాష్ట్రంలో శాంతి భద్రతల కోసం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఢిల్లీ వేదికగా బుధవారం ధర్నా కార్యక్రమం చేపట్టాం' అని చెప్పారు.

మాతాశిశు మరణాల నివారణకు చర్యలు

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో మాతాశిశు మరణాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ ఎస్.భాస్కరరావు వైద్యులు, సిబ్బందికి సూచించారు. జిల్లాలో మే నుంచి జూలై నెల వరకు సంభవించిన 4 మాతృ, 6 శిశు శిశుమరణాలపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మంగళవారం సమీక్షించారు. హైరిస్క్ గర్భిణులను గుర్తించి ప్రసవ తేదీకి ముందు ఆస్పత్రిలో చేర్చడం వల్ల మాతా శిశుమరణాలు తగ్గించవచ్చన్నారు. గర్భిణులు ప్రసవం కోసం ఆస్పత్రిలో చేరినప్పుడు ఆశవర్కర్ గాని, ఏఎన్‌ఎం గాని తోడుగా వెళ్లాలన్నారు. స్కానింగ్ సెంటర్ నిర్వాహకులు లింగ నిర్ధారణ వెల్లడిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని చెప్పారు. సరోగసి రేగ్యులేషన్ చట్టం-2021 ప్రకారం జిల్లాలోని ఫెర్టిలిటీ కేంద్రాలు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. సమావేశంలో డీసీహెచ్‌ఎస్ గౌరీశంకర్, డీఐఓ అచ్యుతకుమారి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఎన్.సూర్యనారాయణ, ఘోషా ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ అరుణ శుభశ్రీ, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ సుజాత, డెమో చిన్నతల్లి, డీపీహెచ్‌ఎన్‌ఓ మామిడి సత్యవతి, నేచర్ సంస్థ ప్రతినిధి కృష్ణారావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

నేరాలు నియంత్రించేలా పోలీస్ గస్తీ



వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

- వన్‌టౌన్, టూటౌన్ పోలీస్ స్టేషన్లను తనిఖీ చేసిన ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైమ్: నేరాలు నియంత్రించేలా పోలీస్ గస్తీ ఉండాలని ఎస్పీ వకుల్‌జిందాల్ పోలీస్ అధికారులకు సూచించారు. వన్‌టౌన్, టూటౌన్, సెంట్రల్ క్రైమ్ స్టేషన్‌లను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్రైమ్ రికార్డులను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో సీజ్‌చేసి ఉన్న వాహనాలు ఏ కేసులోనిది తెలిసే విధంగా ట్యాగ్ చేయాలని, రికార్డులను పక్కాగా నిర్వహించాలని సూచించారు. పోలీస్ సిబ్బందితో మాట్లాడి విధుల తీరును తెలుసుకున్నారు. ఏ తరహా నేరాలు ఎక్కువగా జరుగుతున్నయన్న అంశంపై ఆరా తీశారు. గంజాయి అక్రమరవాణా, విక్రయాలు జరిపే వ్యక్తులను, వినియోగించే వారిని గుర్తించి నిఘా వేయాలన్నారు. లాడ్జీలు, రైల్వేస్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేయాలన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన జనరల్ డైరీ, ఎఫ్ఐఆర్ ఇండెక్స్, రిసెప్షన్ రిజిస్టర్, సీడీ ఫైల్స్, గ్రేవ్ కేసులను, బీటు బుక్‌లను తనిఖీ చేసి అధికారులకు దిశానిర్దేశం చేశారు.

సైబర్ నేరాలను దర్యాప్తు చేసేందుకు దర్యాప్తు అధికారులకు త్వరలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు, వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు, టూటౌన్ సీఐ కె.రామారావు, స్పెషల్ బ్రాంచ్ సీఐ కేకేవీ విజయనాథ్, వన్‌టౌన్ ఎస్ఐలు ఎ.నరేష్, జె.తారకేశ్వరరావు, హరిబాబునాయుడు, నవీన్ పడాల్, టూటౌన్ ఎస్ఐలు ఐ.దుర్గాప్రసాద్, రాజేష్, మురళీ, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

కూలిపోయిన మిద్దె ఇల్లు

- ఇంట్లో నివసిస్తున్న 85ఏళ్ల వృద్ధురాలు
- తప్పిన పెను ప్రమాదం



కూలిపోయిన చిలకమ్మ మిద్దె ఇల్లు

తెర్లాం: కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు పూర్తిగా తడిసిపోయిన ఓ మిద్దె ఇల్లు మంగళవారం తెల్లవారు జామున కూలిపోయింది. ఇల్లు కూలిపోయిన సమయంలో సుమారు 85ఏళ్ల వయస్సు గల వృద్ధురాలు ఇంట్లో ఉండడాన్ని గమనించిన స్థానికులు ఆమెను బయటకు తీసుకురావడంతో పెనుప్రమాదం తప్పింది. తెర్లాం మండలం ఉద్దవోలు గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన కోటిపల్లి చిలకమ్మ నివాసం ఉండే మిద్దె ఇల్లు ఇటీవల కురిసిన వర్షాలకు బాగా తడిసిపోయింది. మంగళవారం తెల్లవారు జామున ఆమె ఇంట్లో ఉన్న సమయంలోనే ఇంటి ముందు భాగం కూలిపోయింది. ఏ ఆధారం లేని వృద్ధురాలి ఇల్లు వర్షాలకు కూలిపోవడంతో నివాసం ఉండడానికి ఆమెకు ఆధారం లేకుండా పోయిందని, అధికారులు ఆమెను ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గోతిలో దిగబడిన లారీ

- ట్రాఫిక్‌జామ్‌తో ప్రయాణికుల ఇబ్బందులు



గోతిలో కూరుకుపోయిన లారీ

బొబ్బిలి రూరల్: మండలంలోని అలజంగి గ్రామసమీపంలో పెద్దగోతిలో లారీ దిగబడిపోయింది. మంగళవారం కురిసిన చిన్నపాటి వర్షానికి బురదగా మారడంతో గొయ్యిని అంచనా వేయలేక లారీ డ్రైవర్ గోతిలోంచి వాహనాన్ని పోనివ్వడంతో అది అక్కడ కూరుకుపోయింది. దీంతో ట్రాఫిక్‌జామ్ కాగా ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. బొబ్బిలి నుంచి తెర్లాం వైపు వెళ్లే, వచ్చే వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గోతులను కంకర మట్టితో పూడ్చడంతో అందులో సుమారు 3 అడుగుల లోతున లారీ కూరుకుపోయింది.భారీ వాహనాలు ఇటువైపుగా రావడం,అవి ఇటువంటి ఇరుకైన ప్రదేశాలలో ఇరుక్కుపోవడం,ఇతర వాహనాలు అటుగా వెళ్లే పరిస్థితి లేకపోవడంతో అంతా ఇబ్బందులు పడుతున్నామని వాహనచోదకులు చెబుతున్నారు. అధికారులు ఇప్పటికైనా తాత్కాలికంగా చేసే మరమ్మతులనైనా నాణ్యంగా చేయాలని లేకుంటే ప్రతిరోజు ఇటువంటి కష్టాలు తప్పవని ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్ర హక్కుల కోసం ఉద్యమించాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వై.వెంకటేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న వై.వెంకటేశ్వరరావు

విజయనగరం ఫూల్‌బాగ్: రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు కలిసి వచ్చే శక్తులతో ఉద్యమాలకు సిద్ధం కావాలని, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వై.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. సీపీఎం జిల్లా ప్లీనరీ సమావేశం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ నివేదిక ప్రవేశపెట్టారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు కె. సురేష్, శంకర్రావు, జగన్‌మోహన్‌రావు, లక్ష్మి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

బొబ్బిలి: పట్టణంలోని అభ్యుదయ హైస్కూల్‌లో రికార్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పెరుగు వెంకట రమణ(61) ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటనపై ఏఎస్సై గౌడు భాస్కర రావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని బెస్త వీధికి చెందిన వెంకట రమణ తన కుమార్తె గాయత్రికి ఇటీవల అప్పులు చేసి వివాహం చేశారు. రుణదాతల ఒత్తిడి ఎక్కువవడంతో తట్టుకోలేక మంగళవారం ఉదయం తన ఇంటిలో క్రిమి సంహారక మందు తాగారు.అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయిన వెంకట రమణను కుటుంబ సభ్యులు గమనించి బొబ్బిలి ఆస్పత్రికి తరలించగా వైద్యసిబ్బంది చికిత్స అందజేశారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం విజయనగరం కేంద్రాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందారు. మృతుడికి ఎయిర్ ఫోర్స్ ఉద్యోగిగా బెంగుళూరులో విధులు నిర్వహిస్తున్న కుమారుడు సాయితేజ ఇటీవల కొద్ది రోజులుగా ఇంట్లోనే ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై భాస్కర రావు తెలిపారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹112	₹194	₹204

సీఆర్‌టీలపై చిన్నచూపు

- నేటికీ రెన్యువల్ ఉత్తర్వులు ఇవ్వని ఐటీడీఏ అధికారులు
- ఆందోళన చెందుతున్న ఒప్పంద ఆశ్రమ ఉపాధ్యాయులు



ఆందోళన చేస్తున్న సీఆర్‌టీలు(ఫైల్)

సాక్షి, పార్వతీపురం మన్యం: ఐటీడీఏల ఆధ్వర్యంలో పని చేస్తున్న కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్లు(సీఆర్‌టీలు) తమ ఉద్యోగ భద్రతపై ఆందోళన చెందుతున్నారు. నేటికీ రెన్యువల్ ఉత్తర్వులు ఇవ్వకపోవడంతో భవిష్యత్తుపై ఆవేదన చెందుతున్నారు. రాష్ట్రంలో 1,284 మంది సీఆర్‌టీలు విధులు నిర్వహిస్తుండగా..పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో 206 మంది, సీతంపేట ఐటీడీఏలో 250 మంది ఉన్నారు. వారికి ఏటా విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే రెన్యువల్ ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉంది. విద్యా సంవత్సరం ప్రారంభమై నెలన్నర రోజులు దాటుతున్నా..ఇంకా తమకు ఎటువంటి ఉత్తర్వులూ ఇవ్వలేదని పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని సీఆర్‌టీలు కొద్దిరోజులుగా ఆందోళన చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి సీఆర్‌టీలతోపాటు, భాషా వలంటీర్లు కలెక్టరేట్‌కు చేరుకుని బైఠాయించారు.

గిరిజన పిల్లలకు మెరుగైన విద్య అందిస్తూ..

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో దాదాపు 15 ఏళ్లకు పైగా వీరు ఒప్పంద ప్రాతిపదికన స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలు, లాంగ్వేజ్ పండిట్‌లు, పీఈటీలుగా పని చేస్తున్నారు. ఆశ్రమ పాఠశాలల్లో పిల్లలకు మెరుగైన విద్య అందించడంలో వీరి పాత్ర కీలకం. టైం స్కేల్ కిందే వీరికి జీతాలు అందుతాయి. గత ప్రభుత్వ హయాంలో 133 మందికి రెగ్యులర్ ఉపాధ్యాయులుగా అవకాశం లభించింది. ప్రస్తుతం ఉన్నవారికి ఈ ఏడాది ఇంకా రెన్యువల్ ఉత్తర్వులు ఇవ్వకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో ఇటీవల కొంతమందికి కౌన్సెలింగ్ నిర్వహించినా, పోస్టింగ్ ఉత్తర్వులు ఇవ్వలేదు. మరో 45 మందికి కౌన్సెలింగ్ కూడా నిర్వహించలేదు. దీంతో వారు తమ విద్యాసంస్థలకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ప్రస్తుత ఐటీడీఏ పీవో విష్ణుచరణ్‌కు బదిలీ అయ్యింది. ఇంకా కొత్త పీవో బాధ్యతలు స్వీకరించాల్సి ఉంది. ఆయన వచ్చి, మళ్లీ అంతా తెలుసుకునేసరికి తమ రెన్యువల్ వ్యవహారం మరింత జాప్యమయ్యే పరిస్థితి ఉంటుందని సీఆర్‌టీలు వాపోతున్నారు.

తక్షణమే రెన్యువల్ ఉత్తర్వులు ఇవ్వాలి

విద్యాసంవత్సరం ప్రారంభమైనా మాకింకా రెన్యువల్ ఉత్తర్వులు ఇవ్వలేదు. దీంతో సీఆర్‌టీలమతా ఉద్యోగ భద్రతపై ఆందోళన చెందుతున్నాం. ఈ ఏడాది కొంతమందికి కౌన్సెలింగ్ నిర్వహించినా ఇప్పటికీ జాయినింగ్ ఆర్డర్లు ఇవ్వలేదు. మరికొంతమందికి కౌన్సెలింగే నిర్వహించలేదు. రాష్ట్రంలో ఎక్కడా ఈ పరిస్థితి లేదు. ఇక్కడే ఇబ్బంది పెడుతున్నారు.

– ఆరిక వెంకటరావు, సీఆర్‌టీల సంఘం అధ్యక్షుడు

ఐటీడీఏ ఆవరణలో రిలే నిరాహారదీక్ష



ఐటీడీఏ కార్యాలయం ఎదుట నిరాహారదీక్షలు చేస్తున్న సీఆర్‌టీలు

పార్వతీపురం: గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో పనిచేస్తున్న సీఆర్‌టీలను తక్షణం రెన్యువల్ చేయాలని కోరుతూ మంగళవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయం ఆవరణలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గిరిజన సంఘం నాయకులు భగవాన్, పి.సురేష్‌కుమార్‌లు మాట్లాడుతూ విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే ప్రతి ఏటా సీఆర్‌టీలను రెన్యువల్ చేసేవారన్నారు. ఈ ఏడాది ఇంతవరకు పూర్తి స్థాయిలో రెన్యువల్ చేయకుండా సీఆర్‌టీలకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. సీఆర్టీలను విధులలోకి తీసుకునేంతవరకు నిరసన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అధికారుల చర్యలతో సీఆర్‌టీలకు ఉద్యోగ భద్రత లేకుండా పోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఆర్‌టీల సంఘం అధ్యక్షుడు ఆరిక వెంకటరావుతో పాటు గుమ్మలక్ష్మీపురం, కొమరాడ, కురుపాం, సాలూరు, మక్కువ మండలాలకు చెందిన సీఆర్‌టీలు త్రినాధరావు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఉదయం తమ సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు పట్టించుకోలేదని ఐటీడీఏ కార్యాలయం ప్రాంగణంలో సీఆర్‌టీలు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. ఈ సమాచారం మేరకు స్థానిక పోలీసులు వచ్చి సీఆర్‌టీలను శాంతింపజేశారు.

వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

- డీఎంహెచ్‌ఓ కె.విజయపార్వతి



ఆశ్రమ పాఠశాలలో సిక్ రిజిస్టర్‌లను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ కె.విజయపార్వతి

పార్వతీపురం టౌన్: విద్యార్థులు సీజనల్ జ్వరాలకు గురికాకుండా వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని పార్వతీపురం మన్యం జిల్లా వైద్యారోగ్య శాఖాధికారిణి డాక్టర్ కె.విజయపార్వతి ఆదేశించారు. ఈ మేరకు పార్వతీపురం మండలంలోని రావికోన, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను మంగళవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆరోగ్య సమస్యల నమోదు రికార్డుల నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ మధ్య కాలంలో జ్వర లక్షణాలతో ఎంత మంది ఉన్నారు? వారికి నిర్వహించిన పరీక్షలు, అందజేసిన చికిత్స ఎవరైనా ఉన్నత ఆస్పత్రిలో చికిత్స పొందారా? తదితర అంశాలపై సిబ్బందిని ఆరా తీశారు. జ్వరం నయమయ్యే వరకు వసతిగృహ సిబ్బంది, వైద్య సిబ్బంది పర్యవేక్షణ తప్పనిసరి అని స్పష్టం చేశారు. విద్యార్థులకు వైద్య సిబ్బంది మలేరియా నిర్ధారణ పరీక్షలు చేసి నెగెటివ్ వచ్చిన వారికి తగు మందులు అందజేశారు. సిక్ రూమ్ నిర్వహణ సక్రమంగా ఉండాలని వార్డెన్‌కు సూచించారు. విద్యార్థులతో డీఎంహెచ్‌ఓ విజయపార్వతి మాట్లాడి చేతుల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్‌మోహన్‌రావు, వైద్యాధికారులు అనూష, ధరణి, ప్రిన్సిపాల్ సింహాచలం, వైద్యసిబ్బంది శంకర్, ఉష, ఊర్మిళ, బంగారు నాయుడు, హాస్టల్ సిబ్బంది, ఆశ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

రూ.10లక్షల వరకు ముద్ర లోన్

- చిన్నయూనిట్‌ల ఏర్పాటుకు ప్రాధాన్యం
- మెప్మా పీడీ సుధాకర్ రావ్



విలేకరులతో మాట్లాడుతున్న మెప్మా పీడీ సుధాకర్‌రావ్

బొబ్బిలిరూరల్: చిరు వ్యాపారాలు చేసుకునేందుకు రూ.50వేల నుంచి రూ.10లక్షల వరకు బ్యాంకు లింకేజీ రుణాలను అందిస్తున్నట్లు మెప్మా పీడీ డి.సుధాకర్‌రావ్ చెప్పారు. ఈ మేరకు మంగళవారం ఆయన స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రూ.10లక్షల వ్యయం దాటిన వారికి చిన్నపరిశ్రమల స్థాపనకు ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. పీఎంఈజీఎస్‌వై పథకం ద్వారా చిన్న, మధ్యతరగతి పరిశ్రమల ఏర్పాటుకు రుణాలను 33శాతం సబ్సిడీపై అందజేస్తున్నామన్నారు. పొదుపుసంఘాల జీవనభృతికి ఆదాయవనరులను సమకూర్చుకునేందుకు వ్యక్తిగతంగా రెండు లక్షల వరకు, సంఘంగా రూ.50లక్షల వరకు రుణాలిచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. వాటిని స్లమ్ లెవెల్ ఫెడరేషన్, టౌన్‌లెవెల్ ఫెడరేషన్‌గా విభజించి రుణసౌకర్యం కల్పిస్తామని, ఆదాయం జీవనోపాధికి ఇవి తోడ్పడతాయన్నారు. 5వేల పొదుపు సంఘాలకు గతేడాది రూ.395కోట్లు బ్యాంకు లింకేజీ రుణాలివ్వగా ఈఏడాది 4,600 సంఘాల గాను 2,854 గ్రూపులు రుణఅర్హత సాధించాయని వాటికి రూ.114కోట్లు రుణాలుగా ఇచ్చేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.సూక్ష్మ ఆర్థిక ప్రణాళిక, వ్యక్తిగత ఆదాయభృతి పద్ధతిన రుణాలను విరివిగా అందించాలని బ్యాంకర్లకు సూచించామని తెలిపారు. పీఎం శ్రీనిధి కింద 14,491 మంది అర్హులను గుర్తించి రూ.3 కోట్ల రుణాలు అందజేశామని చెప్పారు. రూ.100 కోట్లు కార్పస్‌ఫండ్ ఉందని, రూ.250 కోట్లు బ్యాంకులింకేజీ రుణాలను 8,200 సంఘాలలోని 86వేలమంది అందజేశామని వివరించారు. 97శాతం రుణాల రికవరీ ఉండగా 3శాతం పెండింగ్‌లో ఉందని నూరుశాతం పూర్తి రికవరీ సాధిస్తామని వివరించారు.

వంద రోజుల లక్ష్యాలు సాధించాలి

- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం: గృహ నిర్మాణంలో వంద రోజుల లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో గృహ నిర్మాణ సంస్థ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానిక వనరులు ఉపయోగించి గృహ నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేసేందుకు కృషి చేయాలని ఆదేశించారు. వన్ ధన్ వికాస్ కేంద్రాలు (వీడీవీకె), లేదా స్థానికుల ద్వారా ఇటుకల తయారీ అక్కడనే చేయడం తదితర అంశాలను పరిశీలించాలని పేర్కొన్నారు. సామగ్రి సరఫరా చేసేందుకు అవసరం మేరకు సహాయ సహకారాలు అందజేయడానికి ప్రయత్నించాలన్నారు. పీఎం జన్‌మాన్ కింద మంజూరు చేసిన 2375 గృహాల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సచివాలయం సిబ్బందిని అవసరం మేరకు వినియోగించుకోవాలని, సొంత స్థలాల్లో ఇళ్ల పట్టాలు పొందిన లబ్ధిదారులు నిర్మాణం వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

అనుమతులు లేని వాటర్ ప్లాంట్లే ఎక్కువ

- జిల్లా వ్యాప్తంగా అధికారుల తనిఖీల్లో నిర్ధారణ
- అనుమతులున్నవి 17 మాత్రమే
- ట్రస్టుల పేరుతో జోరుగా నీటి విక్రయాలు



గుర్ల మండలం జమ్మిలోని వాటర్ ప్లాంట్‌ను తనిఖీ చేస్తున్న అధికారులు

విజయనగరం అర్బన్: జిల్లా ప్రజలకు సురక్షిత తాగునీటిని అందించేందుకు కలెక్టర్ బీఆర్ అంబేద్కర్ శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా అనధికారిక ఆర్వో వాటర్ ప్లాంట్లపై దృష్టి సారించారు. జిల్లాలో అన్ని వాటర్ ప్లాంట్లను తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్రక్రియ జిల్లా వ్యాప్తంగా మంగళవారం ప్రారంభమైంది. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వాటర్ ప్లాంట్లను తహసీల్దార్లు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తనిఖీ చేశారు. పట్టణ ప్రాంతాల్లో కమిషనర్ల ఆధ్వర్యంలో తనిఖీలు కొనసాగుతున్నాయి. బుధవారం నాటికి అన్ని ప్లాంట్లను తనిఖీ చేసి నివేదిక అందజేయాలని కలెక్టర్ ఆదేశించడంలో అధికార యంత్రాంగం దీనిలో నిమగ్నమైంది. జిల్లాలో బ్యూరోఆఫ్ ఇండియన్ స్టాండర్డ్, ఫుడ్ సేఫ్టీ వారి నుంచి అనుమతి పొందిన ప్యాకేజ్ డ్రింకింగ్ వాటర్‌ప్లాంట్లు కేవలం 17 మాత్రమే ఉన్నట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. సుమారు 63 ప్లాంట్లు ఎటువంటి అనుమతులు లేకుండానే నిర్వహిస్తున్నట్టు గుర్తించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వీటిపై చర్యలకు అధికారులు ఉపక్రమించారు. అనుమతి లేని ప్లాంట్ల సంఖ్య ఇంకా ఎక్కువగానే ఉండే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ట్రస్టుల పేరుతో చాలాచోట్ల వాటర్ ప్లాంటు నిర్వహిస్తున్నారు. వీరు 20 లీటర్ల క్యాన్లతో తాగునీటిని విక్రయిస్తున్నారు. ఇంటింటికి కూడా ఈ క్యాన్‌లలో నీటిని సరఫరా చేస్తున్నారు. ఇలా లక్షల రూపాయల నీటి వ్యాపారం జరుగుతోంది. ఇలాంటి వాటిని గుర్తిస్తున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మొత్తం 31 వాటర్ ప్లాంట్లను తనిఖీ చేయగా వీటిలో 4 ప్లాంట్లకు మాత్రమే అనుమతి ఉన్నట్టు తేలింది. అనుమతులు లేని వాటిని రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. నీటి విక్రయాలు నిలిపివేయాలంటూ ప్లాంట్ల యజమానులకు నోటీసులు ఇచ్చారు.

కొత్తవలస మండలంలో మొత్తం 12 ఆర్వో ప్లాంట్లను తనిఖీ చేయగా వాటిలో 9 ప్లాంట్లకు అనుమతులు లేవని తేలింది. బొండపల్లి మండలంలో పది వాటర్ ప్లాంట్లను తనిఖీ చేసి అన్నింటికీ కాలుష్య నియంత్రణ మండలి నుంచి అనుమతులు తీసుకోవాలని అధికారులు ఆదేశించారు.

సురక్షిత నీటినే సరఫరా చేయాలి



ఆర్వో ప్లాంట్ల ద్వారా ప్రజలకు సురక్షిత తాగునీరు మాత్రమే అందించాలి. ప్లాంటుకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అనుమతులు తప్పనిసరి. అనుమతులు లేని ఆర్వో ప్లాంట్లను మూసివేయిస్తాం.

– బీఆర్ అంబేద్కర్, కలెక్టర్

బ్యాడ్మింటన్ పోటీల్లో వీసీబీఏ సత్తా



సాధించిన పతకాలతో వీసీబీఏ క్రీడాకారులు, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులు

- 28 పతకాలు దక్కించుకున్న క్రీడాకారులు

విజయనగరం: జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు నిర్వహించిన జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో విజయనగరం సిటీ షటిల్ బ్యాడ్మింటన్ అకాడమీ(వీసీబీఏ)కి చెందిన క్రీడాకారులు సత్తా చాటారు. నగరంలోని డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో ఈనెల 18 నుంచి 21వ తేదీ వరకు వివిధ వయస్సుల విభాగాల్లో సింగిల్స్, డబుల్స్ కేటగిరీల్లో నిర్వహించిన పోటీల్లో బాలుర క్రీడాకారులు 14 పతకాలు, బాలికలు 12 పతకాలు, మెన్స్ విభాగంలో 1 పతకం, ఉమెన్స్ విభాగంలో 1 పతకం కలిసి మొత్తంగా 28 పతకాలు కైవసం చేసుకున్నారు. జిల్లా స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను విజయనగరం సిటీ షటిల్ బ్యాడ్మింటన్ అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ వీఎస్ ప్రసాద్, కార్యదర్శి నున్న సురేష్‌లు మంగళవారం ఉదయం అభినందించారు. కార్యక్రమంలో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు డాక్టర్ కేఏ నాయుడు, కార్యదర్శి నున్నా సురేష్‌లను డాక్టర్ వీఎస్ ప్రసాద్, ఎంకేబీ శ్రీను, ఎస్.మల్లికార్జున రావు ఇతర సభ్యులు సన్మానించారు. అనంతరం క్రీడాకారులను అభినందిస్తూ వారికి మంచి శిక్షణ ఇచ్చిన కోచ్ జి శ్రీనివాస రావును అభినందిస్తూ త్వరలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు మరింతగా శిక్షణ ఇచ్చి జాతీయస్థాయి క్రీడాకారులుగా తయారు చేయాలని కోరారు.

పొదుపుసంఘాలకు రూ.120కోట్ల రుణాలు

- డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి
- మార్ట్స్ ఏర్పాటుకు స్థలపరిశీలన



విలేకరులతో మాట్లాడుతున్న పీడీ కల్యాణ చక్రవర్తి

బొబ్బిలి రూరల్: జిల్లాలో మహిళా పొదుపుసంఘాలకు ఇప్పటివరకు రూ.120కోట్లు బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలుగా అందజేసినట్లు డీఆర్‌డీఏ పీడీ కల్యాణచక్రవర్తి చెప్పారు. ఈ మేరకు మంగళవారం ఆయన బొబ్బిలి ఎంపీడీఓ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 40,500 పొదుపు సంఘాలుండగా 29,180 సంఘాలు రుణ అర్హత కలిగినవిగా గుర్తించామని తెలిపారు. వారికి బ్యాంకులింకేజీ రుణాలకింద రూ.1,353 కోట్ల రుణాలను ఇచ్చేందుకు లక్ష్యంగా నిర్ణయించామన్నారు. అలాగే శ్రీనిధి కింద రూ.160కోట్లు రుణ లక్ష్యం కాగా ఇప్పటివరకు రూ.39.4కోట్లు అందజేశామన్నారు. బ్యాంకుల్లో పొదుపుసంఘాల సొమ్ము రూ.600కోట్లు ఉన్నట్లు తెలిపారు. ఆ మొత్తానికి బ్యాంకర్లు తక్కువ వడ్డీ చెల్లిస్తున్నందున తమ శాఖ ద్వారా ఇతర అవసరాలకు వినియోగించి ఎక్కువ వడ్డీని చెల్లించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. పొదుపు సంఘాల సభ్యులు చెల్లిస్తున్న రుణాలను క్యాష్‌లెస్ చెల్లింపులు జరిగేలా పేటీఎం మెషీన్‌లను అందించామని, మధ్యవర్తుల ప్రమేయం, లంచాలు లేకుండా ఈ పద్ధతిని ప్రవేశపెట్టగా మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. అలాగే జిల్లాలో 5 మార్టులకు ప్రతిపాదించగా ప్రస్తుతం 2మార్టులను విజయవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎస్.కోట మార్ట్ టర్నోవర్ రూ.2.4కోట్లు కాగా గరివిడి మార్టు రూ.3.5కోట్ల టర్నోవర్‌తో నడుస్తున్నాయన్నారు.జిల్లాలో మరో 3మార్టుల ఏర్పాటుకు స్థలపరిశీలన చేస్తున్నామని వివరించారు. శ్రీనిధి పథకం కింద లక్షవరకు రుణాలిస్తుండగా వ్యక్తిగత రుణాలను రూ.5లక్షల వరకు పెంచామని,కుటీర పరిశ్రమలకు కూడా ఇది వర్తిస్తుందని స్పష్టం చేశారు.

ప్రైవేట్ ఉద్యోగాలకు ఉచిత శిక్షణ



శిక్షణకు సంబంధించిన వివరాలు వెల్లడిస్తున్న జేడీఎం మార్టిన్

రాజాం: పలు ప్రైవేట్ ఉద్యోగాలకు సంబంధించి నిరుద్యోగ పురుష అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నామని వెలుగు జేడీఎం డి.మార్టిన్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన రాజాం మండల సమాఖ్య కార్యాలయంలో ఎ.సి ఎ.చిరంజీవితో కలిసి ఏపీఎంలతో సమీక్షించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ 24 సంవత్సరాల లోపు నిరుద్యోగ పురుష అభ్యర్థులకు సేల్స్ సూపర్‌వైజర్, ప్రొడక్షన్ కెమిస్ట్, జూనియర్ స్టోర్‌కీపర్, సెక్యూరిటీ ఆఫీసర్ వంటి ప్రైవేట్ ఉద్యోగాలకు శిక్షణ ఇస్తున్నామన్నారు. విజయనగరంలోని టీటీడీసీ కార్యాలయంలో సెంచూరియన్ యూనివర్సిటీ సమన్వయంతో ఈ శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. శిక్షణ అనంతరం ఉద్యోగ కల్పన ఉంటుందని భరోసా ఇచ్చారు. విద్యార్హతల ఆధారంగా ఇంటర్మీడియట్, ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులు శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి, తెర్లాం మండలాల్లోని సమాఖ్యలను ఈనెల 25వ తేదీ లోగా సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీనిధి ఏజీఎం ఉమామహేశ్వరరావు, బ్యాంకు లింకేజీ డీపీఎం రాజ్‌కుమార్, డీపీఎం బి.రవికుమార్, శ్రీనిధి మేనేజర్ సుధాకర్, రాజాం, రేగిడి, సంతకవిటి, వంగర, తెర్లాం మండలాలకు చెందిన ఏపీఎంలు ఎన్.అప్పలనాయుడు, బి.గోవిందరావు, టి.సీతారాం, ఎం.చక్రపాణి, ఎల్‌సీ ఏపీఎం దధికుమార్, ఎస్‌వీఈపీ ఏపీఎం పి.శేషగిరి, ఎఫ్‌పీఓ ఏపీఎంలు హేమలత, మంగమ్మలు, సీసీలు పాల్గొన్నారు.

డైట్ విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించాలి

నెల్లిమర్ల: డీఈడీ–2018 లో ఫెయిలైన ప్రభుత్వ, ప్రైవేట్ డైట్ విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షల ఫీజు చెల్లించాలని డైట్ ప్రిన్సిపాల్ జి.పగడాలమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీఈడీ–2018 మొదటి సంవత్సరం పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షల ఫీజు వచ్చేనెల 4లోగా చెల్లించాలని, ఆలస్య రుసుముతో వచ్చే నెల 20వ తేదీలోగా చెల్లించాలని పేర్కొన్నారు. అలాగే ఒకసబ్జెక్టుకు రూ.100, రెండు సబ్జెక్టులకు రూ.120, మూడు సబ్జెక్టులకు రూ.140, నాలుగు సబ్జెక్టులకు రూ.150 పరీక్ష ఫీజు చెల్లించాలని సూచించారు.

ఆర్‌టీసీ కింద పడి వ్యక్తి మృతి

విజయనగరం క్రైమ్: జిల్లాకేంద్రంలో ఎత్తు బ్రిడ్జి సమీపంలో మంగళవారం ఆర్టీసీ బస్సు కింద పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. మంగళవారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి వన్‌టౌన్ ఎస్సై నరేష్ కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జేఎన్‌టీయూ సమీపంలో నివాసం ఉంటున్న శ్రీనివాసరావు (50) మేస్త్రీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం గంటస్తంభం వద్ద ఉన్న కూలీలతో మాట్లాడి పని బెత్తాయించి తిరిగి సైకిల్‌పై కలెక్టరేట్ వైపు వెళ్లడానికి వస్తూ ఎత్తుబ్రిడ్జి వద్దకు వచ్చేసరికి విజయనగరం నుంచి పార్వతీపురం వెళ్తున్న ఆర్టీసీ బస్సు పక్కనుంచి వెళ్లింది. దీంతో బస్సు వెనుక భాగం తగిలి వెనుక చక్రాల కింద పడి తీవ్రగాయాలపాలయ్యాడు. వెంటనే జిల్లా కేంద్రాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్సై నరేష్ కుమార్ తెలిపారు.

ఏడు వాటర్ ప్లాంట్ల సీజ్

తెర్లాం: ఎటువంటి అనుమతులు లేకుండా ఇంతవరకు యథేచ్ఛగా మినరల్ వాటర్ విక్రయిస్తున్న ఏడు వాటర్ ప్లాంట్‌లను రెవెన్యూ అధికారులు మంగళవారం సీజ్ చేశారు. దీనికి సంబంధించి తెర్లాం తహసీల్దార్ రాజ్యలక్ష్మి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఇచ్చిన ఆదేశాల మేరకు తహసీల్దార్ ఆధ్వర్యంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అప్పలరాజు, వీఆర్వోలు మండలంలోని మినరల్ వాటర్ ప్లాంట్‌లపై సోమ, మంగళవారాల్లో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో మండలంలో 8 మినరల్ వాటర్ ప్లాంట్‌లు ఉన్నట్లు గుర్తించారు. ఏయే గ్రామాల్లో వాటర్ ప్లాంట్‌లు ఉన్నాయో, ఆ గ్రామాలకు వెళ్లి వాటర్ ప్లాంట్ల నిర్వహణకు అనుమతి (లైసెన్స్) ఉందా? లేదా? అని యజమానులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. తెర్లాంలో ఉన్న ఒక్క మినరల్ వాటర్ ప్లాంట్‌కు మినహా మండలంలో మిగిలిన 7 వాటర్ ప్లాంట్లకు అనుమతులు లేవని రెవెన్యూ అధికారులు గుర్తించారు. అనుమతి లేని వాటర్ ప్లాంట్లను సంబంధిత నిర్వాహకుల సమక్షంలో సీజ్ చేశారు. ఇదే విషయాన్ని తనిఖీ అధికారులు తహసీల్దార్‌కు తెలియజేశారు.